

శాస్త్రోక్తంగా పల్లకీ ఉత్సవం

శ్రీశైలంటెంపుల్: మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని గురువారం ఉత్సవమూర్తులకు పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. అలాగే శ్రీభ్రమరాంబాదేవికి శాస్త్రోక్తంగా ఊయలసేవ జరిపారు.



జెడ్పీలో పంద్రాగస్టు వేడుకలు

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి జాతీయ జెండాను ఎగుర వేశారు. జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి, పరిపాలనాధికారులు పాల్గొన్నారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తిమట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,622
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 71
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 35,437
అవుట్ ఫ్లో(క్యూసెక్కులు)	: 1,10,614

న్యూస్‌రీల్

గుంతకల్లు- బోదన్ రైలు నేడు పునఃప్రారంభం

మద్దికెర: గుంతకల్లు నుంచి కర్నూలు, కాచిగూడ మీదుగా బోదన్ వెళ్లే రైలు (07671) శుక్రవారం పునఃప్రారంభం కానుంది. ఈ మేరకు రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 6:00 గంటలకు గుంతకల్లులో బయలుదేరే ఈ రైలు మద్దికెరకు 6.11 గంటలకు వస్తుంది. తుగ్గలి, ఎద్దులదొడ్డి, పెండేకల్లు, లింగమనేని దొడ్డి, మల్యాల, డోన్, బోగోలు, వెల్దుర్తి, ఉలిందకొండ, దూపాడు మీదుగా కర్నూలుకు ఉదయం 8.24 గంటలకు వెళ్తుంది. కాచిగూడకు 3.40 గంటలకు చేరుకుంటుంది. అలాగే బోదన్ నుంచి కాచిగూడ మీదుగా గుంతకల్లుకు వెళ్లే 07670 నంబర్ రైలు 17వతేదీ పునఃప్రారంభం కానుంది. ఈ రైలు సాయంత్రం 6:54 గంటలకు మద్దికెరకు రానుంది. కర్నూలు, హైదరాబాద్ మధ్య డబుల్ లైన్ పనుల కారణంగా ఈ రైళ్లను రెండు నెలల క్రితం ఆపివేసిన విషయం తెలిసిందే.

23 మంది ఎస్‌ఐలకు స్థానచలనం

కర్నూలు: నంద్యాల, అనంతపురం, అన్నమయ్య, వైఎస్సార్ కడప, చిత్తూరు జిల్లాల్లో పనిచేస్తున్న 23 మంది ఎస్‌ఐలకు స్థానచలనం కలిగింది. ఈ మేరకు నంద్యాల జిల్లా ఎస్పీ ఆదిరాజ్‌సింగ్ రాణా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా వీఆర్‌లో ఉన్న ఏడుగురు ఎస్‌ఐలు స్టేషన్లకు నియమితులయ్యారు. స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు వీఆర్‌కు బదిలీ అయ్యారు. అన్నమయ్య, అనంతపురం, వైఎస్సార్ కడప, చిత్తూరు జిల్లాల్లో పనిచేస్తున్న ఐదుగురు నంద్యాల జిల్లాకు నియమితులు కాగా, నంద్యాల జిల్లాలోని వివిధ స్టేషన్లలో పనిచేస్తున్న 18 మంది ఎస్‌ఐలను అదే జిల్లాలోని ఇతర స్టేషన్లకు బదిలీ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు.

జిల్లా కోర్టులో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం



జాతీయ జెండాకు వందనం చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ది

కర్నూలు (లీగల్): జిల్లా కోర్టులో పంద్రాగస్టు వేడుకలను నిర్వహించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఉదయం 8:30 గంటలకు ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ది త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రతి ఒక్కరూ స్వాతంత్ర్య సమరయోధుల్ని స్మరించుకోవాలన్నారు. మూడు రోజుల క్రితం న్యాయవాదులకు నిర్వహించిన వివిధ క్రీడల్లో విజేతలకు న్యాయమూర్తులు బహుమతులు ప్రదానం చేశారు. అదనపు జిల్లా జడ్జీలు జి.ప్రతిభా దేవి, జి.భూపాల్‌రెడ్డి, పి.పాండురంగారెడ్డి, సబ్ జడ్జీలు టి.మల్లీశ్వరి, దివాకర్, బీఎల్‌వీ శేషాద్రి, జూనియర్ సివిల్ జడ్జీలు టి.జ్యోత్స్న దేవి, ఎం.సరోజమ్మ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి రవికాంత్, బార్ కౌన్సిల్ సభ్యులు రవిగువేరా, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, న్యాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రథమ బహుమతి గెలుచుకున్న వ్యవసాయ శాఖ శకటం



ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యాశాఖ శకటం



తృతీయ బహుమతి గెలుచుకున్న గృహనిర్మాణ శాఖ శకటం

అంకితభావంతో అభివృద్ధికి కృషి చేద్దాం

- స్వాతంత్ర్య సమరయోధులను స్ఫూర్తిగా తీసుకుందాం
- త్వరలో విజయవాడ నుంచి కర్నూలుకు విమాన సర్వీసులు
- ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి
- పంద్రాగస్టు వేడుకల ప్రసంగంలో మంత్రి టీజీ భరత్



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న మంత్రి టీజీ భరత్, చిత్రంలో కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ బిందు మాధవ్

కర్నూలు: స్వాంతంత్ర్య సమరయోధులను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని, వారి స్ఫూర్తితో అధికారులు, ఉద్యోగులు అందరూ అంకితభావంతో జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ పిలుపునిచ్చారు. పంద్రాగస్టు వేడుకలను గురువారం కర్నూలులోని కొండారెడ్డిబురుజు దగ్గర ఉన్న పోలీస్ పరేడ్ మైదానంలో ఘనంగా నిర్వహించారు. మంత్రి టీజీ భరత్ ముఖ్య అతిథిగా పాల్గొని పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ బిందు మాధవ్‌తో కలసి కవాతు వాహనం పైనుంచి సాయుధ పోలీసు దళ పరిశీలన చేశారు. ఏఆర్, సివిల్, ట్రాఫిక్, హోంగార్డ్స్, ఫైర్, స్కౌట్ అండ్ గైడ్స్ ప్లటూన్లు మార్చ్ ఫాస్ట్ నిర్వహించాయి. అనంతరం వేదిక పైనుంచి జిల్లా ప్రజలనుద్దేశించి మంత్రి టీజీ ప్రసంగించారు. వేడుకల్లో జిల్లాపరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కర్నూలు పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్సీ మధుసూదన్, జాయింట్ కలెక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి భరత్ మాట్లాడుతూ.. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, తెర్నెకల్ గ్రామ పోరాట యోధుడు ముత్తుకూరు గౌడప్ప, జాతీయ భావాలు ప్రేరేపించిన గాడిచర్ల హరిసర్వోత్తమ రావు వంటి ఎందరో మహానుభావులు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారని గుర్తు చేశారు.

జిల్లా స్థాయిలో ప్రణాళిక

జిల్లాస్థాయి ప్రణాళికను రూపొందించుకుని, అమలు దిశగా ప్రభుత్వం ముందడుగు వేస్తోందని మంత్రి టీజీ భరత్ అన్నారు. ఇందులో భాగంగా ఉత్తమమైన నూతన ఇండస్ట్రియల్ పాలసీ, ఎంఎస్‌ఎంఈ పాలసీ, ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ, ఇండస్ట్రియల్ క్లస్టర్ పాలసీలను తీసుకువచ్చే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఓర్వకల్లు ఇండస్ట్రియల్ జోన్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.1,800 కోట్లు మంజూరు చేయనుందని, గుట్టపాడు క్లస్టర్ అభివృద్ధి, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఓర్వకల్లు ఎయిర్‌పోర్టులో రన్‌వే ఎక్స్‌టెన్షన్, నైట్ ల్యాండింగ్, ఇతర అభివృద్ధి పనులు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. విజయవాడ నుంచి కర్నూలుకు త్వరలోనే విమాన సర్వీసులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.



పోలీసుల కవాతు

ఇంగ్లిష్ ప్రసంగం అర్థం కాక మధ్యలోనే వెళ్లిపోయిన జనం

జిల్లాలో ఎప్పుడూ లేని విధంగా మంత్రి టీజీ భరత్ తన ప్రసంగాన్ని ఆంగ్లంలో కొనసాగించడంతో చాలామందికి అర్థం కాక మధ్యలోనే వెళ్లిపోయారు. పంద్రాగస్టు వేడుకల్లో ఇప్పటి వరకు పాల్గొన్న మంత్రులంతా తెలుగులోనే మాట్లాడేవారు. అయితే టీజీ భరత్‌కు తెలుగు ఉచ్చారణ సరిగా రాకపోవడంతో ఒకరోజు ముందే అధికారులతో సంప్రదించి ఇంగ్లిష్‌లో అనువాదం చేయించి వేడుకల్లో చదివి వినిపించారు. ఎప్పుడూ లేని విధంగా ఇంగ్లిష్‌లో ప్రసంగం ఏమిటంటూ చాలా మంది చర్చించుకోవడం కనిపించింది.



వేడుకలను తిలకిస్తున్న జేసీ బి.నవ్య, ట్రైనీ కలెక్టర్ కళ్యాణి తదితరులు



జయహో..

స్టాల్స్‌లో సూక్ష్మనీటి సాగు శాఖకు ప్రథమ బహుమతి

జిల్లాలో చేపట్టిన అభివృద్ధిని ప్రతిబింబిస్తూ ఏర్పాటు చేసిన వివిధ ప్రభుత్వ శాఖల స్టాల్స్‌ను అధికారులతో కలసి మంత్రి భరత్ పరిశీలించారు. మొత్తం 16 శాఖలకు సంబంధించి స్టాల్స్‌ను ఏర్పాటు చేయగా వాటిలో ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటి సాగు(ఏపీఎంఐపీ) శాఖకు ప్రథమ స్థానం, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) శాఖకు ద్వితీయ స్థానం, ఉద్యాన శాఖకు తృతీయ స్థానం దక్కాయి.

శకటాల్లో వ్యవసాయ శాఖకు మొదటి బహుమతి

పోలీసు శాఖ ఫాల్కన్ వాహనం, డీఆర్‌డీఏ, గృహ నిర్మాణ శాఖ, వ్యవసాయ శాఖ, ఉపాధి హామీ (డ్వామా), జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, విద్యా శాఖ (సర్వశిక్ష అభియాన్), సంక్షేమ శాఖ, అటవీ శాఖ, పౌర సరఫరాల శాఖ, అగ్నిమాపక శాఖలకు సంబంధించిన శకటాలు ప్రదర్శనలో పాల్గొన్నాయి. అయితే వ్యవసాయ శాఖ శకటానికి మొదటి బహుమతి, విద్యాశాఖ శకటానికి రెండో బహుమతి, గృహనిర్మాణ శాఖ శకటానికి మూడో బహుమతి దక్కింది.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఎడిఫై ఇంగ్లిష్ మీడియం స్కూల్, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల (బాలికల), కేజీబీవీ, సిస్టర్ స్టానిస్లాస్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల, బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు చూపరులను ఆకట్టుకునే విధంగా దేశభక్తి గీతాలు, జానపద గేయాలకు ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం వాటిలో పాల్గొన్న విద్యార్థినీ, విద్యార్థులకు, ప్రభుత్వానికి మెరుగైన సేవలు అందించిన అధికారులు, సిబ్బందికి మంత్రి, కలెక్టర్, ఎస్పీ చేతుల మీదుగా ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. నగర ప్రముఖులు, ప్రజలు, అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు పెద్దఎత్తున కార్యక్రమంలో పాల్గొన్నారు.



స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులను సత్కరిస్తున్న మంత్రి

సమరయోధుల వారసులకు సత్కారం



స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలకు మంత్రి టీజీ భరత్, కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ బిందు మాధవ్‌తో కలసి ఘనంగా సన్మానం చేశారు. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబసభ్యులు గుర్రం జైపాల్‌రెడ్డి, సర్దార్ బుచ్చిబాబు, జి.సుబ్బమ్మ, ఎం.సి.యంకమ్మ, రుస్తుం అలీఖాన్, ఎస్.డి.నాగేంద్రప్రసాద్, ఎల్.సరోజమ్మ, డి.రాధాకృష్ణమూర్తి, ఎస్.ఐ.బాషాబియాబాని, కల్నల్ ఐఎస్ సైడ్, ఖతంతుక్కు చంద్రకుమార్ తదితరులు హాజరుకాగా వారికి శాలువా కప్పి పూలమాలలతో సత్కరించి సగర్వంగా సాగనంపారు.



సాంస్కృతిక వైభవం..



వందేమాతరం.. త్రివర్ణ శోభితం



భారత మాతకు జేజేలు..

నగరపాలక సంస్థపై మంత్రి పెత్తనం

- 90 మంది తాత్కాలిక ఒప్పంద కార్మికుల తొలగింపు?
- 200 మంది కార్మికుల కొత్త నియామకానికి సిఫారసు
- నేటి నుంచే విధుల్లో తీసుకోవాలని మౌఖిక ఆదేశాలు
- వీధిన పడనున్న కుటుంబాలు

స్వాతంత్ర్య వెలుగుల్లో ‘చీకటి బతుకులు’

ఎన్నికలకు ముందు ప్రజల కాళ్లావేళ్లా పడి ఓట్లు వేయించుకున్న టీడీపీ నేతలు నెల రోజులు గడిచేసరికి అదే ఓటర్లను రోడ్డుకీడుస్తున్నారు. ఎన్నికల తర్వాత రాజకీయాలకు అతీతంగా పాలన చేయాల్సిన నేతలు తమ స్థాయి మరిచి పేదల పొట్టకొడుతున్నారు. అరకొర వేతనంతో ఒప్పంద ప్రాతిపదికన పని చేస్తున్న కుటుంబాలను రోడ్డుకీడుస్తూ మంత్రి తీసుకున్న నిర్ణయం ఎన్నో జీవితాల్లో చీకట్లు నింపనుంది. మంచి చేస్తారని ఓట్లు వేస్తే ఏకంగా మా గొంతు కోస్తున్నారని బాధిత కుటుంబాలు గగ్గోలు పెడుతుండటం గమనార్హం.

కర్నూలు(టౌన్): అధికారంలోకి వచ్చి పట్టుమని రెండు నెలలు కూడా కాలేదు. అప్పుడే తమ వాళ్లకు తాత్కాలిక ఉద్యోగులుగా తీసుకోవాలని అధికార పార్టీ నుంచి అధికారులపై ఒత్తిళ్లు అధికమయ్యాయి. గత ఏడాది నుంచి పనిచేస్తున్న వారిని తొలగించి తమ వారినే నియమించాలని మంత్రి నుంచి మౌఖిక ఆదేశాలు వెలువడటం ఆందోళన కలిగిస్తోంది. ఒకరు, ఇద్దరు కాదు.. ఏకంగా 200 మంది కార్మికులను తాత్కాలిక పద్ధతిన తీసుకోవాలని.. ఈనెల 16వ తేదీ శుక్రవారం నుంచే వాళ్లను విధుల్లో నియమించాలని ఆదేశించడం గందరగోళానికి తావిస్తోంది.

90 మంది కార్మికుల తొలగింపు?

గత ఏడాది జూన్ నెల 1వ తేదీన నగరపాలక సంస్థ కౌన్సిల్‌లో చర్చించి 180 మంది తాత్కాలిక ఒప్పంద కార్మికులను తీసుకున్నారు. వీరికి రూ.12 వేల వేతనం ఇస్తున్నారు. వీరంతా నగరపాలక సంస్థ పరిధిలోని 52 వార్డుల్లో పూడిక తీత పనులు చేయాల్సి ఉంటుంది. ప్రతి సంవత్సరం ఈ ప్రక్రియ జరుగుతుంది. గత ఏడాది తీసుకున్న 180 మంది కార్మికుల్లో వివిధ కారణాలతో కొంత మంది మానుకున్నారు. మిగిలిన 90 మంది కార్మికులంతా ఈ ఏడాది మే 31వ తేదీ వరకు పనిచేశారు. తాజాగా మరోసారి కౌన్సిల్ ఆమోదంతో వీరిని విధుల్లో కొనసాగించాల్సి ఉంది. అయితే అధికార పార్టీకి చెందిన మంత్రి, ఎమ్మెల్యే కలిసి మొత్తం 200 మంది కార్మికులను తాము చెప్పిన వాళ్లనే తీసుకోవాలని భీష్మించారు. దీంతో ఇప్పటి వరకు పనిచేసిన కార్మిక కుటుంబాలు రోడ్డున పడనున్నాయి. ఎన్నికల ముందు తెలుగుదేశం పార్టీ ఇంటింటికీ ఉద్యోగం అని చెప్పి.. ఇప్పుడు ఉన్న ఉద్యోగాలను సైతం తొలగిస్తుండటం చర్చనీయాంశంగా మారింది.



నగరంలోని మురుగు కాల్వల్లో పూడిక తీత పనులు చేస్తున్న తాత్కాలిక ఒప్పంద కార్మికులు

స్టాండింగ్ కమిటీలో చర్చించకుండానే..

మంత్రి చెప్పడమే కాకుండా ఈనెల 16 నుంచి 200 మంది కార్మికులు విధులకు వస్తారని, చేర్చుకోవాలని మౌఖిక ఆదేశాలు జారీ చేయడంతో అధికార యంత్రాంగం ఇబ్బందులకు గురవుతోంది. ఇంత మంది కార్మికులను విధుల్లోకి తీసుకోవాలంటే ముందుగా నగర పాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సమావేశంలో చర్చించాలి. తీర్మానం చేశాక ఆమోదం పొందాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ ఏమీ లేకుండానే తమ వాళ్లను నియమించుకోండనే మౌఖిక ఆదేశాలతో అధికార యంత్రాంగం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. మంత్రి, ఎమ్మెల్యే.. తమ వాళ్లకు ఉద్యోగాలు ఇవ్వాలనుకుంటే ప్రభుత్వం వద్ద అనుమతి తీసుకుంటే బాగుంటుందని.. అలాకాకుండా తమ పెత్తనం చెలాయించేందుకు వేతనాల భారం నగరపాలక సంస్థపై వేయడం ఏమిటనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.


మేమెట్లా బతికేది



ఏడాది కాలంగా మురుగు కాల్వలు శుభ్రం చేసే పనులు చేస్తున్నా. రూ.12వేల వేతనం ఇస్తున్నారు. కటింగ్స్ పోను రూ.10 వేలు చేతికొస్తుంది. ఈ వేతనంతోనే మా కుటుంబం గడుస్తోంది. ప్రభుత్వం మారిందని మమ్మల్ని ఉద్యోగంలోకి రావద్దంటే ఎట్లా బతికేది. మా స్థానంలో ఇతరులను తీసుకుంటున్నట్లు ఆఫీసులో చెబుతున్నారు. మా కుటుంబం రోడ్డున పడుతుంది. పనిచేసుకొని బతికేటోళ్ల పొట్ట కొట్టడం సరికాదు.

– కుమారి, తాత్కాలిక ఒప్పంద కార్మికురాలు

మమ్మల్ని రోడ్డున పడేయకండి



మున్సిపాలిటీలో ఏడాది కాలంగా పనిచేస్తున్న. తాత్కాలికంగా పెద్ద పెద్ద మురుగు కాల్వల్లో సిల్ట్ తొలగిస్తున్న. మే 31వ తేదీ వరకు పనిచేశాం. మళ్లీ ఇప్పుడు విధుల్లోకి తీసుకోవాల్సి ఉంది. రెండు, మూడు రోజుల్లో పనిలోకి వెళ్తాం అనుకుంటే, ఏకంగా ఇంటికే పరిమితం చేస్తున్నారు. మమ్మల్ని కాదని కొత్త వాళ్లను తీసుకోవడం ఎంతవరకు సమంజసం. ఇదేం న్యాయం సార్. మేము ఏమి పాపం చేశామని మా బతుకులను రోడ్డున పడేస్తున్నారు.

– బి.సుంకన్న, సాయిబాబా వీధి

పార్థసారథి వర్సెస్ మీనాక్షినాయుడు

- ఒకరిపై మరొకరు ఆరోపణలు
- బహిర్గతమైన విభేదాలు

ఆదోని టౌన్/ ఆదోని అర్బన్: కూటమి నేతల మధ్య విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు మధ్య గురువారం మాటల యుద్ధం జరిగింది. తెలుగుదేశం పార్టీ నూతన కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా.. మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ..ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి వాస్తవాలు చెప్పాలని, ఏది పడితే అది చెబితే ప్రజలు నమ్మే స్థితిలో లేరనే వాస్తవాన్ని గమనించాలన్నారు. వైఎస్సార్సీపీ నాయకులను పార్టీలో చేర్పించుకునే ముందు తమతో చర్చించకపోవడం మంచి పద్ధతి కాదన్నారు. ఇలాగే కొనసాగితే ముమ్ముందు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. బసాపురం ఎస్‌ఎస్ ట్యాంకు నిధుల మంజూరులో రెండు నాలుకల ధోరణి పాటించడం మంచి పద్ధతి కాదన్నారు.

- స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ.. చెప్పిందే వినాలి అన్నట్లు మీనాక్షినాయుడు వ్యవహరిస్తున్నారన్నారు. టీడీపీలో ఐదు వర్గాలు ఉన్నాయన్నారు. పది శాతం తన గురించి ఆలోచిస్తే 90 శాతం బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తల గురించే ఆలోచిస్తానన్నారు. సమస్య అంతా మీనాక్షినాయుడుతోనే అని కూటమి కార్యకర్తలు, నాయకులు నిరుత్సాహంగా ఉన్నారన్నారు. అన్నీ కార్యక్రమాలకు తాము పిలుస్తున్నామని, వారే రాలేక పట్టించుకోవడం లేదన్నారు.

సీఐ మురళీధర్‌రెడ్డికి ఇండియన్ పోలీస్ మెడల్

కర్నూలు: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా కర్నూలు మూడవ పట్టణ సీఐ మురళీధర్‌రెడ్డి ఇండియన్ పోలీస్ మెడల్ అందుకున్నారు. పోలీసు శాఖలో ఈయన చేసిన సేవలకు మెచ్చి డీజీపీ సిఫారసు మేరకు కేంద్ర హోంశాఖ గత ఏడాది ఇండియన్ పోలీస్ మెడల్‌ను ప్రకటించింది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం అమరావతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్యక్రమంలో సీఎం చేతుల మీదుగా ఆయన ఈ పతకాన్ని అందుకున్నారు. వైఎస్సార్ జిల్లా పెండ్లిమర్రి మండలం ఎగువపల్లి గ్రామానికి చెందిన ఈయన 1996లో ఎస్‌ఐగా పోలీసు శాఖలో చేరారు. అనంతపురం, కర్నూలు జిల్లాల్లోని పలు స్టేషన్లలో పనిచేసి సీఐగా పదోన్నతి పొందారు. ఈయన తండ్రి మస్తాన్ రెడ్డి ఎస్పీ స్థాయి హోదాలో ఏపీఎస్పీ విభాగంలో సేవలందించి పదవీ విరమణ పొందారు. 27 ఏళ్ల సర్వీసులో ఉత్తమ సేవా పతకం, ఉత్కృష్ట పతకం, సేవా పతకంతో పాటు ఎంఎస్‌ఈ–6, జీఎస్‌ఈలు 125, నగదు రివార్డులు 27, కమాండేషన్లు 5, ప్రశంసాపత్రాలు 2 అందుకున్నారు.



సీఎం చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకుంటున్న సీఐ మురళీధర్‌రెడ్డి

క్లుప్తంగా

జెండావిష్కరణకు వెళ్లనీయకుండా..

కృష్ణగిరి ఎంపీపీని అడ్డుకున్న పోలీసులు

కృష్ణగిరి: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిషత్ కార్యాలయం వద్ద జెండావిష్కణకు కర్నూలు నుంచి వస్తున్న కృష్ణగిరి మండల పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డిని వెల్దుర్తి వద్ద పోలీసులు అడ్డుకున్నారు. వెల్దుర్తి వద్ద హైవేపై పోలీసులు ఎంపీపీ కారును ఆపి సర్కిల్ కార్యాలయానికి తీసుకెళ్లారు. స్వాతంత్య్ర దినోత్సవం రోజున జెండా అవిష్కరణకు వెళ్లుతున్న తనను అడ్డుకోవడం ఏంటని పోలీసులను ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా అంటూ నిలదీశారు. టీడీపీ నాయకులకు వత్తాసు పలకడం తగదన్నారు. శాంతిభద్రతల సమస్య తలెత్తే అవకాశం ఏర్పడుతుందని ఆయనకు సీఐ మధుసూదన్‌రావు నచ్చజెప్పారు. ఇదిలా ఉండగా.. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ విశ్వమోహన్ జెండావిష్కరణ చేశారు. మండలానికి ఎంపీపీ వస్తున్నాడని తెలిసి ఓ వైపు టీడీపీ కార్యకర్తలు, మరో వైపు వైసీపీ కార్యకర్తలు మండల పరిషత్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. టీడీపీ నాయకులు అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి ఎంపీపీని మండలానికి రాకుండా అడ్డుకోవడాన్ని చూసి స్వాతంత్య్ర దినోత్సవం నాడు రాజకీయాలేంటని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.

కేజీబీవీ ప్రిన్సిపాల్ కవితపై వేటు

ఎమ్మిగనూరుటౌన్: మైనారిటీ కాలనీలోని కేజీబీవీ(కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం) ప్రిన్సిపాల్ కవితను విధుల నుంచి పూర్తిగా తొలగిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమె 11 సంవత్సరాలుగా ఇక్కడ పనిచేస్తున్నారు. పలు ఫిర్యాదులు రావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గత నెల 25న జిల్లా విద్యాశాఖ ఏడీ శామ్యూల్ పాల్, డిప్యూటీ ఈఓ వెంకటరమణారెడ్డి, జీసీడీఓ స్నేహలత, స్థానిక ఎంఈఓలు ఆంజనేయులు, మధుసూదన్‌రావు పాఠశాలకు వెళ్లి విచారణ జరిపారు. భోజనాలు సరిగా పెట్టడం లేదని, పస్తులుండాల్సి వస్తోందని విద్యార్థులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. మెనూ మార్చడం..రిజిష్టర్‌లో మాత్రం మెనూ ప్రకారం వడ్డించినట్లు నమోదు చేయడాన్ని అధికారులు గుర్తించారు. తాను చెప్పినట్లు వినకపోతే వంట వారిని తొలగిస్తానని బెదిరించినట్లు విచారణలో తేలింది. విచారణ తరువాత షోకాజ్ నోటీసు ఇచ్చినా సరైన సమాధానం ఇవ్వకపోవడంతో ఆమెను కాంట్రాక్ట్ ఒప్పంద ప్రిన్సిపాల్ ఉద్యోగం నుంచి తొలగిస్తూ డీఈఓ ఉత్తర్వులు ఇచ్చారు. పాఠశాలలో ప్రస్తుతం పనిచేస్తున్న ఇంగ్లిష్ సీఆర్టీ మాలిన్‌బీకి ప్రిన్సిపాల్ బాధ్యతలను అప్పగించారు.

ADONI MUNICIPALITY

e-Procurement Tender Notice

Roc.No. 06/2024-25-E1 Dated : 13-08-2024

Invites Tender Notice under BPS 2019 and LRS 2020 Funds

Down loading Start date and Time : 14-08-2024 @ 11.00 AM

Down loading End date and Time : 17-08-2024 @ 3.00 PM

For further details the tenderer may visit e-procurement platform on www.tender.apeprocurement.gov.in or Cell No. 98499 06650

Sd/- Commissioner, Adoni Municipality.

ఉత్తమ సేవలకు ప్రశంస



పంద్రాగస్టు వేడుకల్లో భాగంగా ఉత్తమ సేవలు అందించిన ప్రభుత్వ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. గురువారం కర్నూలు పోలీస్ పరేడ్ మైదానంలో మున్సిపల్ కమిషనర్ రామలింగేశ్వర్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న మంత్రి టీజీ భరత్, చిత్రంలో కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ బిందు మాధవ్

-సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు



మధుసూదన్‌రావు, డీఆర్వో; ఎన్.శేషిరెడ్డి, ఆర్‌డీఓ; చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్; పి.వి.రమణ, సీఈఓ, సెట్కూరు; హిమప్రభాకర్ రాజు, సీపీఓ; జె.రంగలక్ష్మి దేవి, జేడీ, సోషల్ వెల్ఫేర్; శామ్యూల్, డీఈఓ

ఎ.నూకరాజు, మలేరియా అండ్ డెంగ్యూ ఆఫీసర్; రామాంజనేయులు, డీసీఓ; షర్మిల, డీఎం సివిల్ సప్లయ్స్; డాక్టర్ ఎల్.భాస్కర్, డీఎంహెచ్‌ఓ; సునీల్ ఖన్నా, మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్; టి.నాగరాజు నాయుడు, డీపీఓ; కె.బి.పి.ఎస్.ప్రసాద్, డీఎస్‌ఓ

కె.శ్రీధర్, డీటీసీ; వరలక్ష్మి, డిస్ట్రిక్ట్ అగ్రికల్చర్ ఆఫీసర్; రామలక్ష్మి, ఆర్‌డీఓ, పత్తికొండ; ఎం.సి.గంగ, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్; నూర్జహాన్, డీఎల్‌పీఓ, ఆదోని; సి.విజయభారతి రెడ్డి, కోఆపరేటివ్ ఆఫీసర్; సుష్మిత, టైపిస్ట్



భవాని, సీనియర్ అసిస్టెంట్, రిజిస్ట్రేషన్; ఎన్.రాధ, జూనియర్ అసిస్టెంట్; శ్రీరాములు, జాయింట్ డైరెక్టర్; ఉమాదేవి, పీడీ, ఏపీఎంఐపీ; సలీం బాషా, పీడీ, డీఆర్‌డీఏ; అమర్నాథ్ రెడ్డి, పీడీ, డ్వామా; శ్రీనివాసులు,ఆర్‌ఎం, ఏపీఎస్‌ఆర్టీసీ; ఉమాపతి, ఎస్‌ఈ, విద్యుత్ శాఖ; రాజశేఖర్, ఎస్‌ఈ, టిడ్కో; సోమశేఖర్ రెడ్డి, జెడ్‌ఎం, ఏపీఐఐసీ; రాంమురళి మోహన్, డిప్యూటీ తహసీల్దార్; కీర్తి, డిప్యూటీ తహసీల్దార్

కృష్ణ, దఫేదార్; వెంకటేశ్వర్లు, డీఆర్‌ఓ సీసీ; డి.హుసేన్, డేటా ఎంట్రీ ఆపరేటర్; ఆనంద్, కలెక్టర్ గన్‌మెన్; భాస్కర్, ఆఫీస్ సబార్డినేట్; గిరికుమార్‌రెడ్డి, డీటీ; జయన్న, తహసీల్దార్; గాయత్రి, డీటీ, ఆస్పరి; శ్రీధర్, సీఐ; మన్సూరుద్దీన్, సీఐ; శ్రీనివాసులు, సీఐ; హనుమంతయ్య, ఎస్‌ఐ

పరమేశ్వరుడు, హెచ్‌సీ; ఎం.ఆల్ఫ్రెడ్, ఏఆర్ హెచ్‌సీ; ఎస్.ఎం.బాషా, అడిషనల్ కమాండెంట్; బి.వినోద్ కుమార్, డీఎస్పీ; రాజేంద్రప్రసాద్, సీఐ; రామాంజనేయులు, సీఐ; రమేష్ బాబు, సీఐ; కాశన్న, జూనియర్ అసిస్టెంట్; తిమ్మక్క, డీఎల్‌పీఓ; డాక్టర్ పి.శివకుమార్, ఎనిమల్ హస్బెండరీ; డా.ఎం.అమృతకుమార్‌రెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్; బి.షకీల, అసిస్టెంట్ మేనేజర్

పరిమళ, గ్రేడ్-3 అసిస్టెంట్; శివరంజని, ఏఎస్‌ఓ; జితేంద్ర, ఏఓ, జడ్పీ; మహమ్మద్ హక్, సీనియర్ అసిస్టెంట్, జడ్పీ; చంద్రశేఖర్‌రెడ్డి, ఏఓ, కల్లూరు; రూత్, సీనియర్ అసిస్టెంట్; సోమశివారెడ్డి, డిప్యూటీ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్; శోభారాణి, ఎంఈఓ; పరమేశ్వరరెడ్డి, డీవీఈఓ; కర్రెన్న, డీఈఈ; శిరీష, డిప్యూటీ రిజిస్ట్రార్; భవ్యశ్రీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్, చిప్పగిరి

సీఎస్‌పి సొహైల్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్; ఆసిఫ్ హుసేన్, వృత్తి నైపుణ్య వికాస నిపుణులు; హరిప్రసాద్, అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్, డీఆర్‌డీఏ; ఎ.అమృత, అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్; రామచంద్ర నాయక్, జూనియర్ అసిస్టెంట్; పి.ఆనందరాజు, ట్రెజరర్; శారదమ్మ, అంగన్‌వాడీ వర్కర్; కె.హనుమంతరావు, సీనియర్ అసిస్టెంట్; కేపీఆర్ స్వామి, జూనియర్ అసిస్టెంట్; డాక్టర్ పి.ఉమ, డీపీఎంఓ; సీహెచ్ విజయ, సీనియర్ అసిస్టెంట్; డాక్టర్ పద్మవిజయశ్రీ, బయోకెమిస్ట్రీ వైద్యురాలు

ఎం.శ్యామల, ఆఫీస్ సబార్డినేట్; డా.మాధవి శ్యామల, జనరల్ సర్జన్; సాలొమోన్ రాజు, సూపరింటెండెంట్; శైలజ, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్; లక్ష్మీగురప్ప, ప్రిన్సిపల్; సుప్రజ, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్; కె.ప్రమీల రాణి, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్; ఎం.లక్ష్మీనారాయణ, ఈఈ; గోన నాగరాజు, డీఈఈ; మనోహర్‌రెడ్డి, ఎంవీఐ; రామకృష్ణ, సీఐ; శ్వేత కీర్తి, ఔట్‌రీచ్ వర్కర్

జి.ఎరికి నాయుడు, జైలర్; ఎం.వెంకటరెడ్డి, పీపీ; వకుమారయ్య, డివిజనల్ పీఆర్‌ఓ; వీరబాబు, ఆఫీస్ సబార్డినేట్; రవణమ్మ, ఆఫీస్ సబార్డినేట్; మహబూబ్ బాషా, డీఎంఏ; షేక్ షాహిద్, ఆఫీస్ సబార్డినేట్; తెలుగు రాంబాబు, 108 పైలట్; సుధారాణి, మేనేజర్; వైఎస్ అనంత వాసు దేవ్, చైల్డ్ సైంటిస్ట్; సోమశేఖర్, వార్డర్, సబ్ జైలు; రేణుక, సైంటిస్ట్

క'రుణ' చూపకున్నా.. కాకిలెక్కలు!

- 2024-25 వార్షిక రుణ ప్రణాళిక రూ.15,068.46 కోట్లు
- ఖరీఫ్ పంట రుణాల లక్ష్యం రూ.2,873.96 కోట్లు
- జూన్ చివరి నాటికే రూ.2,335.35 కోట్లు పంపిణీ చేసినట్లు లెక్కలు
- ఎంఎస్‌ఎంఈ కింద మూడు నెలల్లోనే రూ.1189.83 కోట్లు పంపిణీ చేశారట!

కర్నూలు(అగ్రికల్చర్): ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇప్పటి వరకు అధికారికంగా వార్షిక రుణ ప్రణాళికను విడుదల చేయలేదు. రుణాల పంపిణీపై అనిశ్చితి ఉంది. అధికారికంగా ఈ నెల మూడో వారంలో వార్షిక రుణ ప్రణాళిక విడుదల చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. కానీ రుణాల పంపిణీ మాత్రం ముమ్మరంగా జరుగుతున్నట్లు లెక్కలు చూపుతున్నారు. ఈ ఏడాది వార్షిక రుణ ప్రణాళికను రూ.15,068.46 కోట్లతో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్(ఎల్‌డీఎం) రూపొందించినట్లు తెలుస్తోంది. ఇందులో వ్యవసాయ రంగానికి రూ.7,746.84 కోట్లు పంపిణీ చేయాలనేది లక్ష్యంగా నిర్ణయించారు. అయితే జూన్ 31 వరకు ఉన్న లెక్కలను పరిశీలిస్తే వ్యవసాయ రుణాల పంపిణీలో బ్యాంకర్లు అంకెల గారడీకి పాల్పడుతున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వ్యవసాయ రంగానికి మొత్తంగా రూ.3,066 కోట్లు రుణాలుగా పంపిణీ చేసినట్లు లెక్కలు చెబుతున్నాయి.

➤ ఖరీఫ్ పంట రుణాల లక్ష్యం రూ.2,873.96 కోట్లు ఉండగా.. ఇందులో రూ.2,335.35 కోట్లు పంపిణీ చేసినట్లు లెక్కలు ఉన్నాయి. 2023 ఖరీఫ్ పంట రుణాలను రెన్యువల్ చేయడం ద్వారా పంట రుణాల పంపిణీలో రూ.77.78 శాతం ప్రగతి సాధించినట్లు చూపడం గమనార్హం. 2023 ఖరీఫ్ సీజన్‌లో అంటే ఏప్రిల్ నుంచి సెప్టెంబరు నెల చివరి వరకు పంట రుణాల పంపిణీ లక్ష్యం రూ.2,926.01 కోట్లు ఉండగా.. 2,31,731 మంది రైతులకు రూ.3,312.89 కోట్లు పంపిణీ చేశారు. ఈ సారి ఖరీఫ్‌లో మాత్రమే జూన్ నాటికే రూ.77.78 శాతం పంపిణీ చేసినట్లు లెక్కలు ఉన్నాయి.

➤ ఈ ఖరీఫ్‌లో కొత్త రైతులకు, కౌలుదారులకు రుణాలు పంపిణీ చేసిన దాఖలాలు లేవు. క్షేత్రస్థాయిలో బ్యాంకులు పంట రుణాలు ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతులు, సాగుదారులు రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం నుంచి భరోసా దక్కక, బ్యాంకులు పట్టించుకోకపోవడంతో రైతులు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

➤ అగ్రికల్చర్ టర్మ్‌లోన్ల కింద రూ.468.08 కోట్లు, వ్యవసాయ మౌలిక సదుపాయాల కింద రూ.12.87 కోట్లు, వ్యవసాయ అనుబంధ రుణాలు రూ.350.63 కోట్లు ప్రకారం మొత్తంగా వ్యవసాయ రంగానికి సంబంధించి రూ.3066.53 కోట్లు పంపిణీ చేసినట్లు లెక్కలు స్పష్టం చేస్తున్నాయి.

➤ వార్షిక రుణ ప్రణాళిక ప్రకారం మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్(ఎంఎస్‌ఎంఇ) కింద రూ.2,560.77 కోట్లు పంపిణీ చేయాలనేది లక్ష్యం.అయితే మొదటి మూడు నెలల్లోనే రూ.1,189.83 కోట్లు పంపిణీ చేసి 46.49 శాతం ప్రగతి సాధించినట్లు లెక్కలు ఉన్నాయి.

➤ ఈ ఏడాది జూన్ 31 వరకు విద్యా రుణాలు రూ.14.66 కోట్లు, హౌసింగ్ రుణాలు 11.51 కోట్లు, రెనెవబుల్ ఎనర్జీ కింద రూ.4.24 కోట్లు, ఇతర రుణాలు 145.11 కోట్లు, నాన్ ప్రియారిటీ సెక్టారులో రూ.1368.72 కోట్లు ప్రకారం మొత్తంగా రూ.5800.61 కోట్లు రుణాలు పంపిణీ చేసినట్లు లెక్కలు స్పష్టం చేస్తున్నాయి.



తేనీటి విందుకు హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

తేనీటి విందు

కర్నూలు (సెంట్రల్): ప్రజాప్రతినిధులు, అధికారులకు కలెక్టర్ పి.రంజిత్ బాషా గురువారం సాయంత్రం తేనీటి విందునిచ్చారు. క్యాంప్ కార్యాలయంలో ఇచ్చిన విందుకు మంత్రి టీజీ భరత్, ఎంపీ బి.నాగరాజు, ఎమ్మెల్సీ మధుసూదన్, ఎమ్మెల్యేలు గౌరుచరితారెడ్డి, బీవీ జయనాగేశ్వరరెడ్డి, పార్థసారథి , ఎస్పీ బిందు మాధవ్, జేసీ బి.నవ్య, డీఆర్వో కె.మధుసూదన్‌రావుతో పాటు అన్ని శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

'వేడుక' చూస్తున్నారా?



స్వాతంత్య్ర దినోత్సవ పరేడ్‌కు కర్నూలు వెళ్లిన విద్యార్థులు తిరుగుప్రయాణంలో ఆటోలో ప్రమాదకరంగా ప్రయాణిస్తూ కనిపించారు. విద్యార్థులను చిన్నటేకూరు నుంచి తీసుకెళ్లిన అధికారులు తిరిగి వారిని సురక్షితంగా పంపించేందుకు చర్యలు తీసుకోలేదు. కిక్కిరిసిన ఆటో వెనక భాగంలో విద్యార్థులు నిలబడి ప్రయాణించాల్సి వచ్చింది. -సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు

రాజకీయ ఆధిపత్యం కోసమే

శ్రీనివాసులు హత్య!

వైఎస్సార్‌సీపీపై నిందమోపే యత్నం

- సోషల్ మీడియా వేదికగా విష ప్రచారం
- పోలీసుల అదుపులో ఆరుగురు టీడీపీ వర్గీయులు

తుగ్గలి(పత్తికొండ): అధికార టీడీపీలో ఆధిపత్య పోరు హత్యా రాజకీయాలకు దారితీస్తోంది. పార్టీలో, గ్రామాల్లో పట్టు కోసం సొంత పార్టీలోని ప్రత్యర్థి వర్గాన్ని మట్టుబెడుతున్నారు. తాజాగా పత్తికొండ మండలం హోసూరు గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకుడు శ్రీనివాసులును అదే గ్రామానికి చెందిన అధికార పార్టీలోని ప్రత్యర్థి వర్గం నాయకులు తలపై రాడ్లతో కొట్టి అత్యంత దారుణంగా హతమార్చిన ఘటన కలకలం రేపింది. వాకిటి శ్రీనివాసులు సుమారు 20 సంవత్సరాలుగా కెఈ కుటుంబానికి అత్యంత సన్నిహితంగా ఉంటున్నాడు. ఈ క్రమంలో అతని భార్య శారదమ్మ సర్పంచ్‌గా గెలుపొందింది. రెండు నెలల క్రితం టీడీపీ అధికారంలోకి రావడంతో పార్టీ, ప్రభుత్వ కార్యాలయాల్లో ఇతని మాటే చెల్లుబాటు అవుతుండటంతో పాటు పత్తికొండ మండల సహకార సంఘం అధ్యక్షుడిగా అయితే బాగుంటుందని చర్చ స్థానిక ఎమ్మెల్యే వద్ద కూడా వచ్చింది.

బతికుంటే పట్టు సాధించలేమనే..

మొదటి నుంచి టీడీపీకి, కెఈ కుటుంబానికి గ్రామంలో ఏకైక నాయకుడిగా ఉన్న శ్రీనివాసులకు గత మూడు సంవత్సరాల నుంచి మరో వర్గం తయారైంది. వీరికి తోడు సరిహద్దులో పనిచేస్తూ పదవీ విరమణ చేసిన మరో వ్యక్తి తోడు కావడంతో ప్రత్యర్థి వర్గం మరింత బలపడింది. అయితే రెండు వర్గాలను రాజీ చేయకుండా ఇరువర్గాలను వేర్వేరుగా పెంచి పోషిస్తూ వచ్చింది కేఈ కుటుంబం. ఈ క్రమంలో గత సార్వత్రిక ఎన్నికల సమయంలో గ్రామంలో ఓటర్లకు డబ్బులు పంపిణీ విషయంలో ఇరువర్గాలు ఘర్షణ పడి కొట్టుకున్నారు. ఆ సందర్భంగా కేఈ కుటుంబ సభ్యులు శ్రీనివాసులుకే వత్తాసు పలకడం, ఎన్నికల తర్వాత కూడా ఆయన హవా కొనసాగుతుండటంతో ప్రత్యర్థి వర్గం జీర్ణించుకోలేకపోయింది. ఇక ఇతను జీవించి ఉంటే ఎన్నిరోజులైన మనం ఎదగలేమని భావించి హత్య చేసినట్లు చర్చ జరుగుతోంది.

ఒక హత్య.. వంద అబద్ధాలు

అధికార పార్టీలో రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరు, వ్యక్తిగత విభేదాలు వెరసి ఓ వర్గానికి చెందిన నాయకుడి హత్యకు దారితీసింది. ఘటన జరిగిన వెంటనే నిజానిజాలు తెలుసుకోకుండా.. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఈ ఘటనతో వైఎస్సార్‌సీపీ నాయకులకు ఎలాంటి సంబంధం లేదని చెబుతున్నా టీడీపీ నాయకులు హత్యా రాజకీయానికి తెరలేపారు. పచ్చ మీడియా పూనకం వచ్చినట్లు హడావుడిగా బ్రేకింగ్ అంటూ వైఎస్సార్‌సీపీ, పార్టీ నేతలపై విమర్శలు గుప్పించారు. సోషల్ మీడియా వేదికగా విష ప్రచారానికి పూనుకున్నారు. హంతకులు టీడీపీ నాయకులే అయినప్పటికీ వాస్తవాలను కప్పిపుచ్చి మంత్రి లోకేష్ సైతం అబద్ధాలు ప్రచారం చేయడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది.

పోలీసుల అదుపులో ఆరుగురు నిందితులు

శ్రీనివాసులు హత్య కేసుకు సంబంధించి టీడీపీకి చెందిన సీఆర్‌పీఎఫ్ మాజీ జవానుతో పాటు మరో ముగ్గురు టీడీపీ నేతలను బుధవారం సాయంత్రం అదుపులోకి తీసుకుని కర్నూలు ఎస్పీ కార్యాలయానికి తరలించారు. గురువారం అదేపార్టీకి చెందిన మరో ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని కర్నూలుకు తరలించినట్లు సమాచారం.